
సాక్షి పల్నాడు

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట

నాదెండ్ల: తూబాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సోమవారం గ్రామ దేవతలు అంకమ్మ తల్లి, పోర్ల అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను ప్రతిష్టించారు.



పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 8 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



నెమలిలో పవిత్రోత్సవాలు

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రారంభించిన 15 రోజులకే కుంగిన రోడ్డు



పెదకూరపాడు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. కోటి 50 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభించిన 15 రోజులకే కుంగిపోయింది. జూలై 18వ తేదీన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఈ రహదారి ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పుడీ రహదారి కంభంపాడు జలాలపురం మధ్య కుంగిపోయింది. నాసిరకం నిర్మాణానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది.

గారపాడులో పంచలోహ విగ్రహాలు చోరీ




పెదకూరపాడు: గారపాడు గ్రామంలో ఆదివారం పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఆలయ అర్చకులు గొట్టుముక్కల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజల నిర్వహించేందుకు ఆదివారం ఉదయం అర్చకులు తలుపులు తెరవగా స్వామివారి, అమ్మవారి కళ్యాణ పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. దక్షిణం వైపు గేటు తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి స్థానికులకు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఐ పత్తిపాటి సురేష్, ఎస్సై గిరిబాబులు సంఘటన స్థలానికి చేరుకొని సోమవారం విచారించారు. క్లూస్ టీం ద్వారా ఆనవాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సురేష్ తెలిపారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల ఛాయ్ పే చర్చ



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ ఆవరణలోని క్యాంటీన్ వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం చేపడుతున్నట్టు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘం రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు కే.ఆర్.సూర్యనారాయణ, రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చుక్కా వెంకటేశ్వర్లు, కంపాల వెంకటేశ్వర్లు, షేక్.బాజీ, ఏ.భాగ్యమేరీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జు సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 586.50 అడుగులకు చేరింది. ఇది 302.9125 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,664, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 44,132 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 66,407 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

లక్ష్మీ నృసింహస్వామికి గొలుసు అందజేత



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీనృసింహ స్వామి వారికి విజయవాడకు చెందిన మండ్రు శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు రూ.లక్ష విలువైన పింక్ కలర్ రాయి చైన్‌ను బహూకరించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి మంగళగిరి పట్టణానికి చెందిన మానుకొండ వీరభద్రరావు, శివపార్వతి దంపతులు రూ. లక్ష విలువైన తిరునామాలను అందజేశారు.

ఎరువుల పంపిణీలోనూ వివక్ష

- రైతులకు పార్టీలు అంటగట్టడం దుర్మార్గం
- యూరియాను బ్లాక్‌లో అమ్మకుండా చర్యలు తీసుకోవాలి
- త్రీ మెన్ కమిటీ పేరుతో టీడీపీ వారికే ఎరువులు ఇవ్వటం ఘోరం
- రైతులకు పార్టీ ముద్ర వేయకుండా ఎరువులు అందజేయాలి
- ఏ పంటకు గిట్టుబాటు ధర ఇస్తారో ప్రభుత్వం తక్షణమే రైతులకు తెలియజేయాలి
- రైతులపై కూడా రెడ్‌బుక్ అమలు చేస్తున్న ప్రభుత్వం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి, మాజీ మంత్రి విడుదల రజిని, బొల్లా తదితరులు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ రెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో రైతులకు పార్టీల పేరుతో ఎరువులు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఘోరంగా అవమానిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు సోమవారం పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి విడుదల రజిని, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి రైతులకు కావాల్సిన యూరియాను తక్షణమే అందుబాటులోకి తీసుకొని రావాలని, రైతులందరికీ సమానంగా ఎరువులను పంపిణీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మాదిగ, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, భవనం నరిసిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన డాక్టర్ గోపిరెడ్డి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు, డాక్టర్ సుధీర్‌భార్గవ రెడ్డి

టీడీపీ వారికే ఇస్తున్నారు : గోపిరెడ్డి

డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాకు ఖరీఫ్, రబీ పంటలకు కలిపి మొత్తం 1,20,540 టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటిదాకా సమకూర్చింది కేవలం 23,142 టన్నులు మాత్రమేనన్నారు. మిగిలిన 50 వేల టన్నుల యూరియాను రైతులకు అందజేయాలని పార్టీ తరఫున పల్నాడు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. అదేవిధంగా డీఏపీ 51,883 టన్నులు అవసరమైతే కేవలం 9337 టన్నులు మాత్రమే ఇచ్చారని, 3,51,765 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమైతే 62,160 మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా ప్రైవేట్ మార్కెట్‌లో బ్లాక్‌లో అమ్ముతున్నారని, ప్రభుత్వ సొసైటీలో కూడా చూస్తే, త్రీమెన్ కమిటీ పేరుతో టీడీపీ వారికే ఇస్తున్నారన్నారు.

గిట్టుబాటు ధరపై స్పష్టత ఏదీ? : విడదల రజిని

మాజీ మంత్రి విడుదల రజిని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి రైతులందరికీ పార్టీ, కులం చూడకుండా ఎరువులు ఇచ్చేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో ఏ పంటకు గిట్టుబాటు ధర లేదని, ఏ పంట వేయాలో తెలియని దుస్థితిలో రాష్ట్ర రైతాంగం ఉందన్నారు. వెంటనే రైతులకు ఏ పంట వేసుకోవాలి ఏఏ పంటలకు గిట్టుబాటు ధర ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులకు పార్టీల ముద్ర వద్దు: బొల్లా

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ సొసైటీలలో యూరియాను తమ పార్టీకి చెందిన వాళ్లకు అధిక ధరకు అమ్ముతున్నారని, రైతులకు పార్టీల ముద్ర వేయకుండా సమానంగా వారికి కావలసిన ఎరువులను తక్షణమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

సమానంగా ఇవ్వాలి : గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ రైతులు ఏ పార్టీకి చెందిన వారైనా వారందరికీ తక్షణమే సమానంగా ఎరువులు ఇవ్వాలని పార్టీ ఇవ్వాలన్నారు. అన్నదాతల్లోనూ బేధాలు చూపడం తగదన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

పీజీఆర్ఎస్‌లో 91 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజలు అందించిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళిలతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 91 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

జిల్లా ఎస్పీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. నూతన హాల్‌లో మొదటి క్రైమ్ రివ్యూ సమావేశాన్ని ఐజీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర సమీక్షలు, శాఖాపరమైన అంతర్గత సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహణలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతనంగా హాల్ నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన హాల్‌లో ప్రారంభ సమావేశాన్ని బ్యాంకర్లతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పక్కన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ

మన మిత్ర-వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లాలో వాట్సప్ గవర్నెన్స్‌పై 'మనమిత్ర'పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని 15వ తేదీ వరకు పెద్దఎత్తున చేపట్టి ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమం పట్ల అవగాహన, దేశభక్తి భావం పెంపొందించాలని ఆదేశించారు. 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏడాది నుంచి 19ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలకు 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ టాబ్లెట్ ఒకటి పంపిణీ చేయాలని ఆదేశించారు.

మృత్యుకుహరాలు గ్రానైట్ క్వారీలు

బల్లికురవ దుర్ఘటనలో మృతుల సంఖ్యపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీలు మృత్యుకుహరాలుగా మారాయి. పొట్టకూటి కోసం ఒడిశా, ఎంపీ, యుపీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన కార్మికులు వచ్చి క్వారీల్లో పనిచేస్తూ మృత్యువాత పడుతున్నారు. ఆర్గనైజర్ల ద్వారా పనిలోకి వస్తున్న కార్మికులు ప్రమాదాల్లో మృతి చెందినా యజమానులు బయటకు తెలియనీయడంలేదు. మృతుల వివరాలు తక్కువగా చూపి మృతదేహాలను మట్టిలో కప్పెడుతున్నారు. దీంతో తమవారు ఎక్కడున్నారో? ఎక్కడ పనిచేస్తున్నారో, అసలు ఏమయ్యారో కూడా వారి కుటుంబ సభ్యులకు తెలిసే అవకాశంలేదు. ఒకవేళ మృతుల వివరాలు తెలిసిన కార్మికులు ఉన్నా.. క్వారీల యజమానులు వారిని భయపెట్టి వివరాలు కుటుంబ సభ్యులకు చేరకుండా చూస్తున్నారు.

ప్రమాద ఘటనలో మృతులెందరు?

శనివారం జరిగిన బల్లికురవ మండలం కొనెదన రెవెన్యూలోని సత్యకృష్ణ క్వారీ ప్రమాదఘటనలో మృతుల సంఖ్యపై బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలో పెద్ద దుమారమే రేగింది. పచ్చనేత దివ్య రామాంజనేయులుకు చెందిన ఈ క్వారీలో జరిగిన ఘటనలో మృతుల సంఖ్య 15గా ఉందని కొందరు.. కాదు 16 మంది అని మరికొందరు అంతకు మించి ఉండవచ్చని ఇంకొందరు చెబుతున్నారు. వాస్తవానికి ప్రమాద సమయంలో ఆరు జాకీలు పనిచేస్తుండడంతో 18 మందికి తక్కువ లేకుండా ఉన్నారని కార్మిక వర్గాలు చెబుతున్నాయి. కానీ అధికారులు మొత్తం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని ప్రకటించారు. వారిలో ఆరుగురు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డట్లు తెలిపారు. కానీ నరసరావుపేట ఆసుపత్రిలో ఏడుగురు చికిత్స పొందుతున్నట్లు చూపారు. ముగ్గురు గాయపడితే ఏడుగురు ఎలా చికిత్స పొందుతారని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ లెక్కన మృతుల సంఖ్య ఎక్కువ ఉండవచ్చని, ఆరుగురిని లెక్క చూపి మిగిలిన మృతదేహాలను క్వారీలోనే పూడ్చి పెట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పొంతన లేని ప్రకటనలు

ప్రమాద ఘటనపై అధికారులు, పోలీసులు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశారు. క్వారీలో 12 మంది కార్మికులు మాత్రమే ఉన్నారని, ఆరుగురు మృతి చెందిగా ముగ్గురు గాయాలపాలయ్యారని, మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారని జిల్లా అధికారి, అధికారులు ప్రకటించారు. క్వారీలో తొమ్మిది మంది కార్మికులు ఉన్నారని, ఆరుగురు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారని అదేరోజు సాయంత్రం అద్దంకిలో సీఐ విలేకరులకు చెప్పారు. ఆదివారం నాటికి గాయపడినవారి సంఖ్య ఏడుకు పెరిగింది. పరస్పర విరుద్ధమైన ప్రకటనలతో మృతుల సంఖ్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేతులు మారిన రూ. కోట్లు

క్వారీ ప్రమాదంలో పదిమందికి మించి కార్మికులు మృతి చెందితే లీజులు రద్దయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రమాదంలో ఎక్కువ మంది మృతి చెందినా ఆరుగురు మాత్రమే మృతి చెందినట్లు చూపుతున్నట్లు సమాచారం. అధికారులు మృతుల సంఖ్యను మార్చిమార్చి చెప్పి ఎట్టకేలకు ఆరుగురుగా ప్రకటించారు. మిగిలిన వారిపై స్పష్టతనివ్వలేదు. క్షతగాత్రుల సంఖ్యను ఇష్టానుసారంగా ప్రకటించడం విమర్శలకు దారితీసింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గం కావడంతో ప్రమాద ఘటన అనంతరం అధికారపార్టీ ముఖ్యనేతల జోక్యంతోపాటు రూ.కోట్లలోనే డబ్బులు చేతులు మారిన కారణంగానే అధికారులు మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు పాతర

వాస్తవానికి క్వారీలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. కార్మికులు పనిచేసేటప్పుడు వారికి భద్రతా పరంగా హెల్మెట్లు, బూట్లు ఇతర సామగ్రి ఇవ్వాలి. కార్మికులకు పర్యవేక్షకులుగా మేట్లు, ఫస్ట్‌క్లాస్ మేనేజర్ ఉండాలి. ఆదివారం సెలవు కావడంతో వారెవరు లేరని తెలుస్తోంది. అయినా ఆదివారంనాడు కార్మికులతో ఎలా పనిచేయించారో క్వారీ యజమానులు, అధికారులు చెప్పాలి. బల్లికురవ, సంతమాగులూరు పరిధిలో సుమారు 50 క్వారీలు ఉండగా ఒక్కొక క్వారీలో వందమంది చొప్పున 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 60 నుంచి 70 శాతం మంది ఇతర రాష్ట్రాల కార్మికులు ఉన్నారు. క్వారీ ప్రమాదాల్లో గడచిన పదేళ్లలో 100 మంది మృతిచెందినట్లు సమాచారం.



తలకు హెల్మెట్ లేకుండా డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులు

పంపిణీపై పచ్చ ముద్ర

రేషన్ లబ్ధిదారుల నుంచి బలవంతంగా వేలిముద్రలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ
- కూటమి ప్రభుత్వంలో బియ్యం బదులు నగదు డోర్ డెలివరీ
- ఇంటికొచ్చి కార్డుదారుల వేలిముద్రలు వేయించుకొని నగదు పంపిణీ
- దుకాణాల వద్ద బియ్యం బదులు నగదు తీసుకోవాలని ఒత్తిడి
- లేదంటే కార్డులు తొలగిస్తామంటూ బెదిరింపులు
- బియ్యమే కావాలన్నవారికి తక్కువ తూకాలతో పంపిణీ
- ఐవీఆర్ఎస్ సర్వేలో రేషన్ పంపిణీపై తీవ్ర అసంతృప్తి



వినుకొండలో రాత్రిళ్లు బియ్యం పంపిణీ చేస్తుండటంతో క్యూలైన్‌లో నిలుచున్న మహిళలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, రాగులు, ఇతర తృణధాన్యాలు వంటి సరుకులను రైస్‌కార్డు దారులకు ఇంటి వద్దకే ఎండీయూ వాహనంలో అందించేవారు. సరుకుల పంపిణీ పారదర్శకంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎండీయూ వాహన వ్యవస్థలను పూర్తిగా రద్దు చేసి కూటమి కార్యకర్తలకు రేషన్ దుకాణాలను అప్పగించింది. ఇక వారంతా పేదలకు అందాల్సిన బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకొని డబ్బులు సంపాదించడమే ధ్యేయంగా పని చేస్తున్నారు. బియ్యం అడిగితే లేవంటూ వేలిముద్రలు వేయించుకొని నగదు తీసుకోవాలంటూ బలవంతం చేస్తున్నారు. గట్టిగా అడిగితే అధికారమదంతో బెదిరిస్తున్నారు.

కార్డులు తొలగిస్తామంటూ బెదిరింపులు

మాకు డబ్బులు వద్దు బియ్యమే కావాలంటూ ఎవరైనా రైస్‌కార్డు దారులు రేషన్ పంపిణీ కేంద్రాలకు వెళితే వారికి చుక్కలు చూపిస్తున్నారు. సమయపాలన లేకుండా ఎప్పుడు ఉంటారో, ఎప్పటి వరకు ఇస్తారో తెలియకుండా చేస్తున్నారు. రేషన్ దుకాణాల వ్యవస్థ పనితీరుపై కూటమి ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలలో కార్డుదారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కార్డుదారులతో రేషన్ దుకాణాల నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్టు చెబుతున్నారు.

ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు

జిల్లాలో ఒక్కో ప్రాంతంలో కేజీ రేషన్ బియ్యానికి ఒక్కో రేటు కార్డుదారులకు ఇస్తున్నారు. ఇది రూ.8 నుంచి రూ.14 దాకా ఉంటోంది. ముఖ్యంగా నరసరావుపేట లాంటి పట్టణాలలో ఎక్కువమంది దుకాణదారులు రూ.8 ఇస్తున్నారు. ప్రశ్నిస్తే మీకు రైస్‌కార్డు పొందే అర్హత లేదని, కార్డు తొలగిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో చేసేదేమిలేక ఇచ్చింది తీసుకొని వెనుతిరుగుతున్నారు. పల్లెల్లో మాత్రం రూ.12 నుంచి రూ.14 వరకు అందజేస్తున్నారు. డీలర్లు రేషన్ మాఫియాకు రూ.18 నుంచి రూ.20 దాకా అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు.



వినుకొండలోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

నచ్చని వారిపై అధికారులతో దాడులు

రేషన్ దుకాణాలలో బియ్యం కార్డుదారులకు ఇవ్వకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలుతున్నా పౌర సరఫరాలశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. రేషన్ డీలర్లపై విమర్శలొస్తున్నా ఆ శాఖ పట్టించుకోలేదు. ఆయా దుకాణాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు అందుతున్నా కూటమి నేతల ఒత్తిళ్లతో మిన్నుకుండిపోతున్నారు. అధికారం రాగానే రేషన్ డీలర్లను బెదిరించి కూటమి నేతలు ఆయా షాపులను లాక్కొన్నారు. ఎన్నోఏళ్లుగా చేస్తున్న కొందరు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు కోర్టులకు వెళ్లి తమ డీలర్‌షిప్‌ను కాపాడుకుంటున్నారు. అటువంటి వాటిపై కూటమి నేతలు అధికారులను పంపి కక్షపూరితంగా దాడులు నిర్వహించి 6ఏ కేసులు నమోదు చేస్తున్నారు. మాపై వచ్చిన ఫిర్యాదులు చెప్పమంటే ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి ఉందని దుకాణాలను వదిలేయమని సలహాలిస్తున్నారు.

- గత వారం రోజులుగా వినుకొండ నియోజకవర్గంలో ఈ తరహా దాడులు అధికమయ్యాయి. బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు చేసి వదిలేస్తున్నారు. గోదాముల్లో పెద్దసంఖ్యలో రేషన్ బియ్యం దొరికిన సమయంలో కేసులు నమోదు చేస్తున్నామని మీడియాకు సమాచారం ఇస్తున్నారు తప్ప ఆ తరువాత వారిపై ఏ చర్యలు తీసుకుంటున్నారన్నది చిదంబర రహస్యంగా మారుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి నిత్యావసర వస్తువులు సక్రమంగా అందేలా చూడాలని పేదలు కోరుతున్నారు. రేషన్ డీలర్ల అక్రమాలకు అడ్డుకోట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఇంటింటికీ రేషన్ మాఫియా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఇప్పుడు ఇంటింటికి రేషన్ డీలర్లు వస్తున్నారు. అయితే వారు వస్తున్నది సరుకులు ఇవ్వడానికి కాదు.. ఇంటి వద్దే వేలిముద్రలు వేయించుకొని నగదు అందజేసి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడానికి. పోర్టబులిటీ సౌకర్యం ఉండటంతో కార్డుదారులు ఏ షాపులోనైనా సరుకులు తీసుకోవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకొని పట్టణాలలో రేషన్‌డీలర్లు ఇంటింటికి తిరిగి కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకొని నగదు అందజేస్తున్నారు. కేజీ బియ్యానికి రూ.8 నుంచి రూ.10 వరకు అందజేస్తున్నారు. వారికి పంచాల్సిన బియ్యాన్ని రేషన్ మాఫియాకు కిలో రూ.18 నుంచి రూ.20కు అమ్ముకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

తూకంలో భారీ మోసం

తూకాలలో మోసాన్ని బహిరంగా చేస్తున్నా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వం మాకు కోటా తక్కువగా ఇస్తోందని, ఇచ్చిన కొలతలతో తీసుకోవాలని, నచ్చకపోతే నగదు తీసుకొని పోవాలని హెచ్చరిస్తున్నారు. 20 కిలోలు ఇవ్వాల్సిన వారికి 18 కిలోలు మాత్రమే అందజేస్తున్నారు. రెండు కిలోలు తగ్గాయని ప్రశ్నిస్తే నగదు తీసుకుంటే 20 కిలోలకు నగదు ఇస్తామని చెబుతున్నారు. డీలర్లతో వాదించలేదని పేదలకు తినడానికి వారు ఇచ్చిన బియ్యాన్ని భుజాన వేసుకొని నిరాశతో వెనుతిరుగుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఏడుగురు ఎంపిక



సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు సత్తెనపల్లి నుంచి ఏడుగురు ఎంపిక య్యారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా, నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా స్థాయిలో యోగాసనాలు పోటీలు నరసరావుపేట సరస్వతి శిశు మందిర్ స్కూల్లో ఈ నెల 3న నిర్వహించారు. ఈ పోటీలలో సత్తెనపల్లి శక్తి యోగ యోగా గురువు ఎం. రమేష్ సారథ్యంలో సభ్యులు పాల్గొన్నారు. సత్తెనపల్లికి చెందిన ఎమ్ సునీల్‌కుమార్, తల్లం ఆంజనేయులు, ధనేకుల సాంబశివరావు, వల్లూరు శ్రీనివాస్, పులహరి భానోజీ, పులికొండ శ్రీనివాసరావు, మహిళా విభాగంలో డి. కాత్యాయినీ ఏడుగురు గోల్డ్ మెడలు, మెరిట్ సర్టిఫికెట్స్ సాధించటంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సంపాదించారు.

గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నరసరావుపేట టౌన్: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఇన్‌చార్జి రైల్వే ఎస్‌ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. నరసరావుపేట నుంచి మునుమాక వెళ్లే రైలు మార్గంలో ఆదివారం గుంటూరుకు చెందిన పెండెం సాయిబాబు(65) పట్టాలు దాటుతుండగా ఆ సమయంలో వచ్చిన గూడ్స్ రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం బంధువులకు అప్పగించారు.

రెంటచింతలలో చోరీ

బంగారు ఆభరణాలు..నగదు అపహరణ



రెంటచింతల: రెంటచింతలలోని రేంజర్‌గారి బజారులో జరిగిన భారీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రేంజర్‌గారి బజారులో నివసిస్తున్న జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయుడు గెల్లిపోగు జనార్ధనరావు మాచర్ల పట్టణంలో ఉంటున్న తన తల్లి మరియమ్మను చూడటానికి శనివారం భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దాచిన 122 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాస రావు, ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలు ఇస్తున్నా.. పరిష్కారం సున్నా

- ఎస్పీతో మొరపెట్టుకున్న పలువురు బాధితులు
- జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: తమకు జరుగుతున్న అన్యాయంపై, తమ సమస్యలపై ఇప్పటికే పోలీసు పీజీఆర్‌ఎస్‌లో పలుమార్లు అర్జీలు ఇచ్చామని, అయితే వాటిని ఇంతవరకు పరిష్కరించలేదని పలువురు బాధితులు జిల్లా ఎస్పీతో మొరపెట్టుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర 106 సమస్యలపై ఫిర్యాదులు అందాయి.

ఉద్యోగాల పేరిట రూ.56.50లక్షలు మోసం

సత్తెనపల్లిలో నేను నివసించే ఇంటి కింద దండమూడి పూర్ణచంద్రరావు అద్దెకు దిగాడు. నాకు, నా తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికాడు. తనకు తెలిసిన అడబాల శ్రీరామకృష్ణకుమార్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో, కూరపాటి ప్రసాద్ గుంటూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్నట్టు మమ్మల్ని నమ్మించాడు. ఇద్దరికీ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరికి రూ.30లక్షలు డిమాండ్ చేశాడు. తండ్రి నుంచి సంక్రమించిన పొలం అమ్మి రూ.56,50,000లు విడతల వారీగా చెల్లించాం. ఉద్యోగాలు ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తున్నాడు.

– ఊర్లగుండ సాంబశివరావు, సత్తెనపల్లి

పీజీఆర్‌ఎస్‌లో రెండు సార్లు ఫిర్యాదు చేశా..

నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు మా ఇంటిపై దాడి చేసి చంపుతామని అన్నెం శివగోపినాథ్ అనే వ్యక్తి బెదిరిస్తున్నాడు. దీనిపై ఇప్పటికే రెండుసార్లు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశాను. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా శివగోపినాథ్, కాకుమాను సుధాకర్‌లు నన్ను దుర్భాషలాడుతూ మేం ఎమ్మెల్యే మనుషులం ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు కేసులు పెట్టరు మా మాటే వింటారు అంటూ బహిరంగంగా చెబుతున్నారు. ఇంటిపై దాడికి పాల్పడిన సీసీ ఫుటేజ్ ఇచ్చినా ఇంతవరకు పోలీసులు పరిశీలించలేదు. కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్పీని కోరాను.

– కె.స్నేహరెడ్డి, న్యాయవాది, నరసరావుపేట

ఫిర్యాదు చేశాం.. పట్టించుకోలేదు

బాలయ్యనగర్‌లోని నాకు చెందిన రెండు సెంట్ల స్థలాన్ని మందడపు సాంబశివరావు వద్ద తాకట్టు పెట్టి 2018లో రూ.3లక్షలను అప్పుగా తీసుకొని ప్రతి నెల వడ్డీ చెల్లిస్తున్నాను. గత నెలలో పాలపాడుకు చెందిన చంటిబాబు ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేశానని కొంతమందితో కలిసి ఇంట్లోకి వచ్చి సామాన్లు బయటపడేశాడు. దీనిపై రూరల్ పోలీసులతో పాటు పీజీఆర్‌ఎస్‌కు ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ రూరల్ పోలీసులు ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా మమ్మల్ని బెదిరిస్తున్నారు.

– వీర్ల కొండమ్మ, బాలయ్యనగర్, నరసరావుపేట

నా కుటుంబానికి రక్షణ కల్పించండి

ఈనెల 20వ తేదీన బజారులో ఉన్న నా కుమారుడు పుల్లగూర వంశీపై గ్రామ టీడీపీ అధ్యక్షుడు అల్లు నాగవరప్రసాద్, సర్పంచ్ కురాకుల బాబు తదితరులు కర్రలతో దాడి చేసి చంపుతామని బెదిరించారు. అడ్డుకునేందుకు వెళ్లిన నాపై దాడి చేశారు. దీనిపై యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కి వెళ్తే ఫిర్యాదు తీసుకునేందుకు పోలీసులు నిరాకరించారు. నా భర్త అబ్రహంతో పాటు కుమారుడిపై కేసులు పెడతామని ఎస్‌ఐ బెదిరిస్తున్నారు.

– పుల్లగూర ప్రభావతి, జాలాది, యడ్లపాడు మండలం

ముగిసిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలు



బాలుర అండర్-14 విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-19 బాల బాలికల ఫ్లోర్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో 16 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. పోటీల విజేతల వివరాలను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సురేంద్ర ప్రకటించారు. బాలికల అండర్-14 విభాగంలో తిరుపతి జిల్లా జట్టు ప్రథమస్థానం కైవసం చేసుకోగా, శ్రీసత్యసాయి జిల్లా రెండవ స్థానం, కర్నూలు, అనంతపురం జిల్లాలు సంయుక్తంగా మూడవ స్థానంలో నిలిచాయి. అలాగే అండర్-19 విభాగంలో తిరుపతి ప్రథమస్థానం సాధించగా, కృష్ణా, పల్నాడు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర అండర్-14 విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం సాధించగా, పల్నాడు, కర్నూలు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-19 విభాగంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, తిరుపతి, పల్నాడు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

- ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోసఫ్ మాట్లాడుతూ, పోటీలో పాల్గొన్న క్రీడాకారుల నుంచి రాష్ట్ర జట్టుకు కొందరు పేర్లు ఎంపిక చేశామన్నారు. తిరిగి వారి ప్రతిభను పరిశీలించి తుది జట్టును ప్రకటిస్తామన్నారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్‌లో బిహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విజేతలకు పాఠశాల చైర్మన్ నాతాని, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య బహుమతులు అందించారు. ఫ్లోర్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.కిషోర్‌బాబు, పాఠశాల ఇన్‌చార్జి కోట బాపూజీ పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎన్‌డీఏ కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన మాధవ్ రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా రెండవ విడతగా పల్నాడు జిల్లాలో సారథ్యం పర్యటనను సోమవారం నిర్వహించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పల్నాడు ప్రాంతంలో పొగాకు పండించే రైతుల అభ్యున్నతికి రూ.200 కోట్లతో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉదయం వివిధ క్షేత్రాల సమావేశం నిర్వహించి స్టేషన్‌రోడ్డులో ఛాయ్‌పే చర్చ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి పల్నాడు ప్రాంత సమస్యలపై ప్రజల నుంచి తెలుసుకున్నారు. అనంతరం పల్నాడు రోడ్డులోని ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల వద్ద నుంచి జమిందార్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం జిల్లా మేధావుల సదస్సులో పాల్గొని సమస్యలను తెలుసుకున్నారు.

చిన్నారులపై అసభ్య ప్రవర్తన

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తాడేపల్లిరూరల్: పెనుమాకలో నివాసం ఉండే ఓ వ్యక్తి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై పోలీసులు సోమవారం పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బుక్కా వీరయ్య అనే వ్యక్తి ఆ ప్రాంతంలో వున్న 9, 10 సంవత్సరాల బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ముళ్ల పొదల్లోకి తీసుకువెళుతున్నాడు. ఆదివారం కూడా ఒక బాలికను ఇదేవిధంగా చేయడంతో గమనించిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై..

తెనాలిరూరల్: ఇంటర్ చదువుతున్న బాలికను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బాలిక కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు, చినరావూరుకు చెందిన యువకుడు విజయ్ వేధిస్తున్నాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులకు తెలియజేయగా వారి సహాయంతో వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ నెలలో జరిగిన పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఎంఏ తెలుగు, సంస్కృతం, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, హాస్పిటల్ మేనేజ్మెంట్, ఎంబీఏ టీటీఎం జిల్లా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 13వ తేదీ లోపు ఒక్కొక్క పేపర్ కు రూ.1860లు చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిరాక్స్ కాపీల కోసం రూ.2190లు చెల్లించాలని ఆయన సూచించారు.

ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడే ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు డ్రంకెన్ డ్రైవ్, 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అతి వేగంగా ద్విచక్ర వాహనం నడిపే వారిపై, 18 నుంచి 24 వరకు హెల్మెట్ ధరించని వారిపై, 25 నుంచి 31వ తేదీ వరకు బ్లాక్ స్పాట్స్ వద్ద అన్ని రకాల ఉల్లంఘనలకు పాల్పడే ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

తల్లిపాలు బిడ్డ హక్కు



మాట్లాడుతున్న ఎస్.జయలక్ష్మి

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డ హక్కు అని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్. జయలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం గుంటూరు రూరల్ మండలం ఓబులనాయుడు పాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్. జయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు శిశువు జీవితానికి రక్షణ అని, ఆరోగ్య భవితకు బలమైన పునాదని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. తదనంతరం కేంద్రంలో ప్రీస్కూల్ నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. సీడీపీవో జి. విజయలక్ష్మి, ఏసీ డీపీవో సీహెచ్. విజయనిర్మల, సూపర్‌వైజర్లు ఎం.వీ రత్నం, ఎంఎల్‌హెచ్‌పి మేఘన, ఎంఎస్‌కె బి. సుశీల పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులకు ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ సుజాత, ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఈవోపీఆర్డీ షేక్ ఆదంషఫీ, ఏవో సుగుణబేగంతో పాటు ఆయా శాఖల అధికారులు తల్లిపాల ఆవశ్యతను వివరించే కరపత్రాలు పోస్టర్లను ఆవిష్కరించారు.

కౌలు రైతులకు సుఖీభవ వర్తింప చేయాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో 60 నుండి 70 శాతం భూమిని కౌలు రైతులే సాగుచేస్తున్నారని, వీరికి గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలంటే భూయజమాని సంతకం కావాలనే నిబంధన వల్ల గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

నరసరావుపేట రూరల్: ఎరువుల వాడకం తగ్గించే విధంగా రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నరసరావుపేట సబ్‌డివిజన్‌లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు పాల్గొని మాట్లాడారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లు రైతులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి రైతు వేసిన పంటను నమోదు చేయాలని, పంట వేయకపోతే వేయలేదని కూడా నమోదు చేయాలని తెలిపారు. వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి మాట్లాడుతూ వివిధ పంటలలో కలుపు నివారణ, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. భూసారం పెంచేందుకు రసాయన ఎరువుల ప్రత్యామ్నాయ మార్గాలైన పచ్చిరొట్ట, పీఎండీఎస్‌లు పైరులు వేసి 45 రోజులకు భూమిలో కలియదున్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎం.నగేష్, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



షూటింగ్ బాల్ జట్టు

సత్తెనపల్లి: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. బాలుర విభాగంలో 80 మంది, బాలికల విభాగంలో 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు.

బాలుర జట్టుకు: కె. వెంకట్, జి.నవీన్, పి.మోబీన్, బి.రిషి, జి.వెంకటేష్, షేక్.అబ్దుల్, ఎం.హఫీజ్, ఎం.మహీధర్, కె.ప్రవీణ్, జి.మాంజి, కె.సుధీర్, ఎస్.భార్గవ్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు : యమ్.విజయ పరిమళ, కె.హిమబిందు, జె.లక్ష్మి కీర్తన, జె.యశస్విని, పి.మేఘన, పి.సుచరిత, ఎం.నందిని, సిహెచ్.అక్షర, కె.హర్షిత, టి.సింధు, ఎం.జ్యోతిక, ఎస్.మధులు ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనీల్‌దత్తానాయక్, షేక్. మెహబూబి, బి.తులసీరామ్‌నాయక్, ఎ.చిన్నయ్య, తిరుపతమ్మ, రత్నాకర్, యమ్.ప్రసన్న, పి.శివరామకృష్ణ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

పని ఒత్తిడి పెంచిన ఈ ఫోన్‌లు మాకొద్దు

సీడీపీఓ కార్యాలయంలో ఫోన్లు అందజేసిన అంగన్‌వాడీ యూనియన్ నాయకులు



సీడీపీఓకు ఫోన్‌లు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

నరసరావుపేట: ఒక వైపు యాప్‌ల భారం, మరో వైపు సక్రమంగా పనిచేయని ఫోన్లతో అంగన్వాడీలకు పని ఒత్తిడి పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి అన్నారు. సోమవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీల వద్ద ఉన్న ఫోన్‌లను నరసరావుపేట ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ కాంత కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన విరమించుకోవాలన్నారు. ఫోన్ సక్రమంగా పనిచేయక, సరుకులు నెలలో ఒక్కసారిగా ఇవ్వకపోవడం వంటి కారణాలతో అంగన్వాడీలతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మాతా, శిశు సంరక్షణలో అంగన్వాడీల పాత్ర కీలకమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలని కోరారు. 5జి ఫోన్లు పంపిణీ చేయాలని యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రభుత్వం దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లారని, అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ ఫోన్లు పంపిణీ చేయకపోవడాన్ని నిరసిస్తున్నామన్నారు. 5 జి ఫోన్లు పంపిణీ చేసి యాప్‌లు క్రమబద్ధీకరించే వరకు రికార్డులలో లబ్ధిదారులచే సంతకాలు చేయించి పోషకాహారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమ్మెలు, ధర్నాలు ఏమీ చేయడం లేదని పనిఒత్తిడి పెరిగిన నేపథ్యంలో రికార్డుల ద్వారా పనిచేస్తామని చెప్పారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు కవిత, నిర్మల, అంగన్వాడీలు మాధవి, విజయలక్ష్మి, రమణ, కమురూన్, హసీనా, ఏలీనా పాల్గొన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

డిమాండ్ చేసిన పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు



చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శిస్తున్న పౌరహక్కులు, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో భద్రత చర్యలు తీసుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకుని అనుమతులు రద్దు చేయాలని పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1కోటి నష్టపరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.25 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం క్వారీ ప్రమాద స్థలంతో పాటు నరసరావుపేట పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు నరసరావుపేటలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులకు మించి క్వారీలో లోతులోకి వెళ్లి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టారని అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తే క్వారీ యజమానులు ఎలాంటి భద్రత చర్యలు తీసుకున్నట్లు ఆధారాలు కన్పించట్లేదన్నారు. రెవెన్యూ, కార్మిక శాఖ, మైనింగ్ శాఖ పర్యవేక్షణ లోపించడం వలన ఇలాంటి ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయని అన్నారు.

అట్టహాసంగా పోలేరమ్మ జాతర

ఆకట్టుకున్న పెద్దలు, చిన్నారుల నృత్యాలు



పోటెత్తిన భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని రామకృష్ణాపురంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద మూడోరోజు పోలేరమ్మ కొలుపులు సోమవారం ఘనంగా జరిగాయి. మొదటి రోజు ఆడపడుచులు అందరూ కలిసి అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభిషేక మహోత్సవాన్ని వీక్షించడానికి, అమ్మవారి కృపకు పాత్రులు కావడానికి దూర ప్రాంతాల్లో నివసించే వారితోపాటు చుట్టూ పక్కల గ్రామ ప్రజలు హాజరయ్యారు. పోలేరమ్మ జాతర మహాలక్ష్మి గుడి నిపూలు, విద్యుత్ దీపాలతో అలకరించారు. కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సుమారు 20 మంది పాటలతో లయబద్ధంగా నాట్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నాదెండ్ల రాంబాబు, పేరాల నాగేశ్వరరావు, కొన్నే వెంకటేశ్వర్లు, నామేపల్లి లక్ష్మీనారాయణ, శంఖవరపు రాంబాబు, పెద్ద వెంకట్రావు, చిన్న వెంకటరావు, మణి, శరత్, మహేష్, వినుకొండ శ్రీను, కొండవీటి శ్రీను,సాంబ, పత్తిపాటి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10న ఏపీ ర్యాంకింగ్ చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు ఈ నెల 10వ తేదీన లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహిస్తామని నైట్స్ క్యాజిల్ చెస్ అకాడమీ డైరెక్టర్ వై.జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే చిన్నారులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 90631 42105 నెంబరులో సంప్రదించాలన్నారు.